ఆసరాతో అక్కచెల్లెమ్మలకు భరోసా



మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



సంబరాలకు హాజరైన డ్వాక్రా మహిళలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలైన అక్కచెల్లెమ్మలకు ఆసరాతో భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఆసరా సంబరాల్లో భాగంగా పుట్లూరు రోడ్డులోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేశారు. సీఎం చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలసి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడో విడత ఆసరాలో భాగంగా మండలంలోని అక్కచెల్లెమ్మలకు రూ.6.25 కోట్లు మంజూరైందన్నారు. ఇప్పటి వరకూ రూ.18.77 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. అలాగే తాడిపత్రి మున్సిపాలిటీలో రూ.18.45 కోట్లు మంజూరైందన్నారు.

బాబు పాలనలో అక్కచెల్లెమ్మలకు దగా

చంద్రబాబు పాలనలో అక్కచెల్లెమ్మలు దగాపడ్డారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. రుణమాఫీ పేరుతో చంద్రబాబు మహిళలను నిలువునా మోసగించారని గుర్తు చేశారు. ఎన్నికల హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాలు మాఫీ చేశారన్నారు. మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గతంలో ఏ పథకం అందాలన్నా జన్మభూమి కమిటీ సిఫారసులు ఉండేదన్నారు. ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి సిఫారసు లేకుండా ప్రజల గుమ్మం వద్దే పథకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యేను పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, ఎంపీడీఓ రంగారావు, ఏపీఎం రాజశేఖర్, సీఎంఎం తులసి, టీపీఆర్ఓ సతీష్, ఎంపీపీ సరస్వతి, జెడ్పీటీసీ రమణమ్మ, వైకేపీ ఏసీ రాజ్యలక్ష్మి, సీసీలు మండల సమాఖ్య సిబ్బంది, యానిమేటర్లు, ఆర్పీలు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం





చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ,పైలా నరసింహయ్య. హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

శింగనమల: పేద మహిళల ఆర్థిక స్వావలంబనమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా శింగనమలలో 6,387 మంది డ్వాక్రా మహిళలకు రూ.5.38 కోట్ల మెగా చెక్కు అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న చేపట్టిన ప్రతి పథకంలో మహిళలకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈపథకాలను కుల, మతం, పార్టీ బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలకు చెందిన నగదు పేదల అకౌంట్లలో జమవుతుంటే ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. పేదలు బాగు పడడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏపథకం అందాలన్న , ఆ పార్టీ నాయకుల పెత్తనం ఉండేదన్నారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి జగనన్న ఎంతో కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జగనన్న చేపట్టిన ప్రతి పథకం మహిళల పేరట అందించారన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీలకు ముఖ్యమంత్రి జగనన్న పెద్ద పీట వేశారని, నేడు ఎంతో మంది పదవులు పొందారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. బడుగు,బలహీనవర్గాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న జగనన్నకు మహిళలు మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీలు నరసింహులు, విజయ, సర్పంచ్ నాగమునెమ్మ, సరోజమ్మ, ఎంపీటీసీలు ఉమా, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, నాయకులు ఆశోక్, చెన్నకేశవులు, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలా కుమారి, ఏపీఎం నారాయణస్వామి, సీసీలు, అనిమేటర్లు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చూడముచ్చటగా పర్ణశాల



రామస్వామి ఆలయ ఆవరణలో పర్ణశాల

గుత్తి: పట్టణంలోని కోటలో అతిపురాతనమైన శ్రీరామస్వామి ఆలయం శ్రీరామ నవమి వేడుకలకు సిద్ధమైంది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పర్ణశాల చూపరులను ఆకట్టుకుంటోంది. గురువారం శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వడ్డీ మాఫీ సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లుటౌన్: ఈ నెల 31లోగా ఆస్తి పన్ను బకాయిలు ఒకేసారి చెల్లించి వడ్డీ మాఫీ అకాశాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న సూచించారు. వడ్డీమాఫీ అవకాశమివ్వడం వల్ల బుధవారం ఒక్కరోజే రూ.50 లక్షల మేర మొండి బకాయిలు వసూలైనట్లు ఆయన తెలియజేశారు.

మొబైల్ ఆధార్ సేవలు

గార్లదిన్నె: యర్రగుంట్ల గ్రామ సచివాలయం పరిధిలోని ముకుందాపురంలో బుధవారం మొబైల్ ఆధార్ సేవలు అందించారు. ఈసందర్భంగా సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల మధ్య పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్, 2010 నుంచి 2016 మధ్యలో ఆధార్‌కార్డు తీసుకున్న వారికి అప్‌డేట్ చేస్తున్నామన్నారు. సర్పంచు హిమకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

పెద్దవడుగూరు : మండల కేంద్రానికి చెందిన ఆసాదు సుంకన్న అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి కుటుంబానికి రూ.10 వేలు అందించారు. పంచాయితీ కార్యదర్శులు ప్రభాకర్, మురళీకృష్ణారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ మసూద్‌బీ పాల్గొన్నారు.

దాడిలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మర్తాడులో బుధవారం జరిగిన దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన జయప్ప, హరి అనే వ్యక్తులు వ్యక్తిగత కక్షల నేపథ్యంలో కట్టెలతో దాడి చేశారు. రాజన్న తలకు రక్త గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న హనీ బిర్యాని సెంటర్(హోటల్)పై బుధవారం అనంతపురం విజిలెన్స్ ఎస్ఐ శేషగిరి రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో డొమెస్టిక్‌కు వాడాల్సిన సిలిండర్లను కమర్షియల్‌కు వాడుతుంటాన్ని గుర్తించి ఐదు సిలిండర్లను సీజ్ చేశారు. హోటల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది, వీఆర్వోలు పవిత్ర, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవాని మాత జయంతి

పామిడి: పట్టణంలోని మహాయోగ దత్తపీఠంలో బుధవారం భవానీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని భవానీ మాతను శోభాయానంగా అలంకరించారు. పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

పెద్దవడుగూరు : చిరుధాన్యాలు తినడం ద్వారా ఆరోగ్యం లభిస్తుందని డీఆర్‌సీ ఏడీఏ శైలజ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్బీకేలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఏఓ రహనాబేగమ్ పాల్గొన్నారు.

జీవితాంతం రుణపడి ఉంటాం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితో రామిరెడ్డి కాలనీవాసులు

బుక్కరాయసముద్రం: 'గత 25 ఏళ్ల నుంచి ఇక్కడే గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాం.. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు తమ కాలనీకు వచ్చినప్పుడల్లా పట్టాలు ఇవ్వాలని వేడుకున్నాం... ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగని రోజంటూ లేదు. మీరు వచ్చిన తర్వాత మాకు పట్టాలు ఇప్పించారు. మీకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం' అంటూ రామిరెడ్డి కాలనీవాసులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రామిరెడ్డి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా కాలనీవాసులు తమకు ఇంటి పట్టాలు ఇప్పించి జీవితాల్లో వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు తన పాలనలో ప్రజల్లో గుర్తుండిపోయే ఒక్క పథకం అయినా ప్రవేశ పెట్టారా అని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో ప్రజలను నిలువునా మోసగించారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ తన పథకాలతో ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారన్నారు. జగనన్న చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, సుజాత, నాయకులు పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, కొండమ్మ, ముత్యాలశీన, చంద్రమోహన్, సాకే లక్ష్మీనారాయణ, సూరి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఎదుట ఆనందం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

గుంతకల్లు రూరల్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిమ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విద్యార్థులకు రెడీమేడ్ దుస్తుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతోపాటు మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, సర్పంచ్ నక్కా నీలమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇన్నర్‌వీల్ క్లబ్ సేవలను కొనియాడారు. అనంతరం దాత దినేష్ బన్సాలీ అందజేసిన రెడీమేడ్ దుస్తులను ఎమ్మెల్యే విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షురాలు త్రిష్లా బన్సాలీ, వైఎస్సార్సీపీ నాయకులు నక్కా ఓబులేసు, బాబూరావు, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

ప్రశాంతంగా సుంకం వసూలు వేలం

యాడికి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం దినసరి మార్కెట్, జంతు వధశాల బహిరంగ వేలం ప్రశాంతంగా జరిగింది. గ్రామానికి చెందిన రంగనాయకులు రూ.4,00,700లకు వేలం దక్కించుకున్నాడు. దినసరి మాంసపు దుకాణాల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కును రంగప్ప రూ.41వేల వేలం దక్కించుకున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓ ఎర్రిస్వామి తెలిపారు. గతేడాది దినసరి మార్కెట్‌కు రూ.2,71,000 , జంతు వధశాలకు రూ.21 వేలు ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు అనురాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం దినసరి మార్కెట్ సుంకం వసూలు వేలం ప్రశాంతంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర ఉదయం 11 గంటలకు వేలం పాట ప్రారంభించారు. రఫీక్ అనే వ్యక్తి దినసరి మార్కెట్‌ను రూ.18,92,000 కు దక్కించుకున్నాడు. ఈ సారి మున్సిపాలిటీకి రూ.42 వేలు అదనంగా ఆదాయం లభించింది. జంతు వధశాలను రూ.27,000కు షాషావలి అనేవ్యక్తి దక్కించుకున్నాడు. ఈ ఏడాది రూ. 9,000 అదనంగా ఆదాయం లభించింది.



యాడికి పంచాయతీ కార్యాలయంలో వేలం పాటను నిర్వహిస్తున్న దృశ్యం.

రుణాల రికవరీ వేగవంతం చేయండి

యాడికి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాల రికవరీ వేగవంతం చేయాలని ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం. లిఖిత సిబ్బందికి సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ పంట రుణాలు సకాలంలో రెన్యూవల్ చేయించాలన్నారు. పొదుపు మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని, దీనిపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఏడీసీసీ బ్యాంకు జీఎం సురేఖారాణి, మేనేజర్ దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఏడీసీసీ బ్యాంకును బుధవారం ఏడీసీసీ బ్యాకుం చైర్‌పర్సన్ ఎం. లిఖిత, జీఎం సురేఖరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు రికార్డులను పరిశీలించారు. బిజినెస్‌ను మరింతగా పెంచాలని, డిపాజిట్లు విరివిగా సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. బ్రాంచ్ మేనేజర్ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.



యాడికి: రికార్డులు పరిశీలిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత

3న వైఎస్సార్ ఆసరా సంబరాలు

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వచ్చే నెల 3న వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత మెగా చెక్కు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పుట్లూరు: ఏప్రిల్ 4న మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానంద రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వైకేపీ, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. అన్ని గ్రామాల నుంచి మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్దాం

గుంతకల్లుటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. బుధవారం ఇల్లూరు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను వివరించారు. అనంతరం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా ఎన్నికైన విశ్వనాథ్‌ను పార్టీ నాయకులు సన్మానించారు. బీజేపీ పట్టణ కార్యదర్శి రవిబాబు, నేతలు సూర్యనారాయణ, హరిహరనాథ్, మహేష్, విజయలక్ష్మి, మారుతి, రామకృష్ణారెడ్డి, పద్మ పాల్గొన్నారు.

రేపు బైక్‌ల వేలం

గుత్తి: పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 13 బైకులను వేలం వేయనున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ

బుక్కరాయసముద్రం: రోటరీపురంలోని ఎస్ఆర్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్ విద్యార్థులు ఫిక్సెల్ 2కే-23జాతీయ స్థాయి టెక్నికల్ సిపోజియంలో పేపర్ ప్రెజెంటేషన్‌లో అత్యంత ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. ఈనెల 28న అనంతపురం జేఎన్‌టీయు కళాశాలలో ఫిక్సెల్ 2కే-23 జాతీయ స్థాయి టెక్నికల్ సిపోజియం నిర్వహించారన్నారు. పేపర్ ప్రెజెంటేషన్‌లో తమ కళాశాలకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్ విద్యార్థులు గ్రీష్మ, అభినయ, పవిత్ర అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి, ప్రణతి, ప్రణుతి తృతీయ బహుమతి సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, టీపీఓ రంజిత్‌రెడ్డి, హెచ్ఓడీ డాక్టర్ చిత్రలింగప్ప అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎర్రచెరువు కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బుధవారం ఆయన 3వ వార్డు పరిధిలో పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికై పైప్‌లైన్ ఏర్పాటు చేయించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానికులకు సూచించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆయన ఆరాతీశారు. కమిషనర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: కస్తూర్బా బాలికా విద్యాలయంలో ప్రవేశానికి అనాథలు, బడి మానేసిన, బడి బయట ఉన్న పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బీపీఎల్ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారి మాధవిరెడ్డి పేర్కొన్నారు. ఏప్రిల్ 20లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2023-24 సంవత్సరానికి 11వ తరగతి సీఈసీ గ్రూపులో 40 సీట్లు, 6వ తరగతి 40 సీట్లు, 8వ రతగతి 6 సీట్లు, 9వ తరగతి 2 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

గార్లదిన్నె: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో 6, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం,7,8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగసత్య పేర్కొన్నారు. ఆరో తరగతిలో 40 సీట్లు 11వ తరగతిలో 40 సీట్లు ఏడవ తరగతిలో ఒక సీటుకు ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

బుక్కరాయసముద్రం: కస్తూర్బా విద్యార్థులు టెన్త్ పరీక్షలలో మంచి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో మరుగుదొడ్లు, బాత్ రూంలు, క్లాస్ రూంలు, వంట గదిని పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థులు మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలన్నారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు పరీక్షల కిట్‌ను అందజేశారు. ప్రిన్సిపాల్ నాగవేణి ఉన్నారు.

రమాదేవి హంతకుడిని ఉరి తీయాలి

బుక్కరాయసముద్రం: దళిత యువతి రమాదేవిని అతికిరాతకంగా హత్య చేసిన హంతకుడిని ఉరి తీయాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, పూసల సంఘం, జై భారత్ పార్టీల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ముందుగా రమాదేవి హంతకుడు జాఫర్‌ను ఉరి తీయాలంటూ డిమాండ్‌చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. దళిత సంఘం నాయకులు మధు, సాకే హరి, చిన్న ఆంజినేయులు, కదిరప్ప, చంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు చైత్ర శుద్ధ నవమి రాత్రి విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహ వచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, కలశస్థాపన, దీక్షాహోమం జరుతాయన్నాన్నారు. 31 న సింహవాహనంపై స్వామి గ్రామోత్సవము, ఏప్రిల్ 1 న చిన్న శేషవాహనం, 2 న పెద్ద శేషవాహనం, 3 న హనుమద్ వాహనం, 4 న గరుడ వాహనం, 5న గజ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారన్నారు. 6 న గురువారం ఉదయం 4 గంటల 45 నిమిషములకు కుంభ లగ్నంలో ఆలూరులో స్వామి కల్యాణోత్సవం, సాయత్రం 4 గంటలకు రథోత్సవం, 7 న అశ్వవాహనంపై స్వామి వారి పార్వేటోత్సవం ఉంటుందన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: మండలంలోని వెంగన్నపల్లె గ్రామానికి చెందిన విశ్రాంత హెచ్ ఎం కొట్టే వెంకటరెడ్డి(87)అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారులు కె శ్రీనివాసరెడ్డి, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి(డీలరు) పరామర్శించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ పుట్లూరు జయప్రద, రాజారెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, బ్రహ్మానందరెడ్డి, చలమారెడ్డి, నాగేష్, ఆదినారాయణరెడ్డి ఉన్నారు.

నేడు బయారెడ్డిస్వామి ఆరాధన

యల్లనూరు: కోడిమూర్తి గ్రామంలో గురువారం బయారెడ్డి స్వామి ఆరాధన ఘనంగా జరుపుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్వామికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం భోజన వసతి ఉంటుందన్నారు. రాత్రి పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిభ చూపిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులను ప్రదానం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా అఖండ హనుమాన్ చాలీసా పారాయణం

పామిడి: ఎద్దులపల్లిలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రుల్లో భాగంగా బుధవారం అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ పారాయణంతో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు తొలగి సర్వ కార్యసిద్ధి చేకూరుతుందన్నది భక్తుల నమ్మకం.